క్లుప్తంగా

పూర్తయిన గృహ నిర్మాణాలు

భామిని: మండలంలోని బత్తిలిలో హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెండు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. గతంలో ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయగా.. పూర్తికాని గృహాలకు సంస్థ తరఫున సహాయం అందించారు. ఈ క్రమంలో రెండు ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా, శనివారం గృహప్రవేశాలు కూడా చేపట్టారు. కార్యక్రమాల్లో సంస్థ డైరెక్టర్ ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌గా హిమబిందు

సీతానగరం: మండలంలోని తామరఖండి గ్రామానికి చెందిన దాసరి హిమబిందు పార్వతీపురం ఏఎంసీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే విజయచంద్రకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. హిమబిందును పలువురు అభినందించారు.

ఘన, జీవామృతాల తయారీపై అవగాహన

బలిజిపేట: పణుకువలసలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మండల ఇన్‌చార్జ్ లక్ష్మి ఆధ్వర్యంలో ఘన, జీవామృతాలను శనివారం తయారీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు తయారీపై అవగాహన కల్పించారు. వాటిని వినియోగించే విధానాన్ని వివరించారు. ఈ జీవామృతాలు వేయడం వలన భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది పంటలకు కావలిసిన బలాన్ని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

యూరియా కొరతను తీర్చాలి



రైతుల సమస్యలు వింటున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

బలిజిపేట: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా కొరతను తీర్చాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంపావల్లిలో రైతు సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్ర స్థాయిలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు యూరియా కొరతను ఎదుర్కొంటున్నట్టు ఆయన దృష్టికి తెచ్చారు. ఆయన వెంట పలువురు రైతులు ఉన్నారు.

కామ్రేడ్ సిద్దాబత్తుల సేవలు చిరస్మరణీయం



సిద్దాబత్తుల రామచంద్రరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

సాలూరు: కామ్రేడ్ సిద్దాబత్తుల రామచంద్రరావు ప్రజలకు, సీపీఐకు చేసిన సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ నాయకులు అన్నారు. పట్టణంలో సిద్దాబత్తుల ఇంటి వద్ద శనివారం నిర్వహించిన సంస్మరణ సభలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామచంద్రరావు చేసిన సేవలను కొనియాడారు.


విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు



సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట సబ్‌స్టేషన్‌లో తరచూ మరమ్మతులకు గురవుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల పనులు శనివారం చేపట్టినట్టు ఏఈ శశిభూషణరావు తెలిపారు. మండలంలోని అడపా దడపా కురుస్తున్న వర్షాలకు, గాలికి తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో పనులు చేపట్టినట్టు పేర్కొన్నారు. 133 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లకు సిబ్బంది మరమ్మతులు చేశారని తెలిపారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు



ఉంగరాడమెట్ట ఆలయంలోపూజలు చేస్తున్న భక్తులు

రేగిడి: శ్రావణ మాసం, కృష్ణాష్టమి కావడంతో మండలంలోని ఉంగరాడమెట్ట, రేగిడి, అంబఖండి, దేవుదళ తదితర గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి, దుర్గాదేవి, సంతోషిమాత ఆలయాలు భక్తులతో శనివారం కిటకిటలాడాయి. ఆయా ఆలయాల అర్చకులు భక్తులతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు చేయించారు.

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు..

- అప్రమత్తతే మందు
- వర్షాల నేపథ్యంలో ఏజెన్సీ వాసులు అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



వర్షపు నీరు ప్రవాహిస్తున్న గెడ్డలో స్నానాలు చేస్తున్న చిన్నారులు (ఫైల్)

సీతంపేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొత్త నీరు వచ్చి గెడ్డలు, వాగుల్లో చేరుతోంది. ఊట బావులు, పొలాల్లో ఉండే బావులు, బోర్లలో సైతం బురద నీరు చేరి భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. మన్యం వాసులతో పాటు మైదాన ప్రాంతాల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. తాగునీరు, ఆహారం కలుషితం కాకుండా చూడాలని, తాగునీటిని కాచి చల్లార్చిన తర్వాత మాత్రమే తాగాలని స్పష్టం చేస్తున్నారు.

అంటువ్యాధుల భయం..

వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో ఆహారం, నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంటుంది. దీంతో వాంతులు, విరేచనాలు, అతిసార వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఏమాత్రం అనారోగ్యంగా ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆలస్యం చేస్తే ప్రాణాపాయం ఏర్పడవచ్చు. ఈగల ద్వారా కూడా బ్యాక్టీరియా ఆహార పదార్థాలపైకి చేరి వ్యాదులు సోకే అవకాశం ఉంది. మంచినీటి పైపులు, డ్రెయిన్లు పక్క పక్కనే ఉంటే, ఆ రెండింటిలో నీరు కలిసే ప్రమాదం ఉంటుంది. ఇలానీరు కలిసి కలుషితమైతే అనేక రకాల బ్యాక్టీరియాతో పాటు ఈ-కోలి వంటివి శరీరంలోకి చేరి అనారోగ్యానికి గురి చేస్తాయి. ఆర్‌ఓ వాటర్ బాటిళ్లలోని నీరు కూడా సురక్షితమని చెప్పలేం. ఆ నీటిని కూడా 30 నిమిషాల పాటు కాచి చల్లార్చిన తర్వాతే తాగాలి. వీలైనంతవరకు బయట ఆహారం తీసుకోకపోవడం మంచిది.



ఆస్పత్రులో ఇన్‌పేషెంట్లు

ఇప్పటికే ప్రబలిన జ్వరాలు..

ఇప్పటికే స్థానిక ఏరియా ఆస్పత్రిలో జ్వరపీడితులు ఎక్కువగా ఉన్నారు. ప్రతిరోజూ 200ల వరకు ఓపీ వస్తోంది. దీనిలో 80 శాతం మంది జ్వరాలతో బాధపడుతున్నవారే. దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి వంటివి ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెందితే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి విషజ్వరాలు సోకుతాయి.

అప్రమత్తంగా ఉన్నాం..



జ్వరాలు, ఇతర అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉన్నాం. గ్రామాల్లో వైద్యసిబ్బంది కూడా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వైద్యశిబిరాలు కూడా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నాం. – కె.విజయపార్వతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ఐటీడీఏ సీతంపేట

ఐటీడీఏకు కొత్త పీఓను నియమించాలి..



మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు శ్రీనివాసరావు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏకు కొత్త ప్రాజెక్ట్ అధికారిని నియమించాలని గిరిజన జేఏసీ అధ్యక్షుడు బిడ్డిక శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో యశ్వంత్‌కుమార్ రెడ్డి ఇన్‌చార్జ్ పీఓగా ఉన్న సమయంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. జీఓ3 పునరుద్ధరణ కోసం అన్ని ఐటీడీఏల్లో ప్రజాభిప్రాయ సేకరణకు వర్క్‌షాప్ నిర్వహిస్తే ఇక్కడ జరగకపోవడానికి ఆయన లోపమేనని చెప్పారు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని గిరిజన సంఘాలు పలుమార్లు దరఖాస్తులు చేసినా ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఆయన రెగ్యులర్ పీఓగా వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోందని.. ప్రభుత్వం స్పందించి కొత్త పీఓను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు సవర చిరంజీవి, టి.తిరుమలరావు, బిడ్డిక ఉమామహేష్, నిమ్మక కాంతారావు, కొండగొర్రె వినోద్, కె.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం



వైకేఎం కాలనీ వీధిలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

పార్వతీపురం రూరల్: ఏ గ్రామంలో చూసినా, ఏ వీధిలో చూసినా, రోడ్లపై చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తూ వీధి కుమ్మలు స్వైరవిహారం చేస్తున్నాయి. వాహనాలను కుక్కలు వెంబడించడం, వీధుల్లో ఆడుతున్న చిన్నారుల చుట్టూ గుంపులు గా సంచరించడం, వెంటపడుతూ పరుగులు పెట్టించడం స్థానికుల్లో భయాందోళనలకు దారి తీస్తున్నా యి. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో రేబిస్ వ్యాధి తీవ్రతపై పలు పోస్టులు వైరల్ కావడంతో కుక్కల బెడదతో స్థానికులు భయాందోళనలు చెందుతున్నా రు. సంబంధిత పంచాయతీ లేదా మున్సిపల్ అధి కారులు కుక్కలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదర్శవంతంగా ఎదగాలి..



చిన్నారులతో పాలకొండ శక్తి టీమ్ సభ్యులు

పాలకొండ రూరల్: తల్లిదండ్రులు లేరని అధైర్యపడకుండా ఆదర్శవంతంగా ఎదగాలని శక్తి టీమ్ హెచ్‌సీ ప్రకృతాంబ అన్నారు. మండలంలోని అన్నవరం సమీపంలో గల అనాథ బాలుర ఆశ్రమాన్ని శనివారం ఆమె సందర్శించి, చిన్నారులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వారికి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులు గణపతి, ఇతర సిబ్బంది ఉన్నారు.

పోలీసుల ఆదేశాలు బేఖాతరు..!



మక్కువ - చినబోగిలి రహదారిపై వెళ్తున్న ఇనుప వీల్స్ కలిగిన ట్రాక్టర్

మక్కువ: ఫుల్ వీల్స్ టాక్టర్లు రహదారులపై నడిపి తే చర్యలు తీసుకుంటామని, రైతులకు అవగాహన కల్పించి, హెచ్చరికలు జారీ చేసినప్పటికీ పలువురు ట్రాక్టర్ యజమానుల మాత్రం తీరు మారడం లే దు. మండల కేంద్రం మక్కువ నుంచి సీతానగరం మండలం చినబోగిలి గ్రామం వరకు ఇటీవల నూతనంగా రహదారి నిర్మించారు. అయితే ఓ ట్రాక్టర్ యజమాని శనివారం ములక్కాయవలస గ్రామం మీదుగా ట్రాక్టర్‌ని నడుపుకుంటూ వెళ్లడంతో, ఇది చూసిన పలువురు వాహనదారులు, పోలీ సుల మాటలు పెడచెవిని పెట్టి, వారికి నచ్చిన విధంగా రహదారులపై ఇనుప వీల్స్ కలిగిన టాక్టర్ల ను నడుపుతున్నారని ఆరోపిస్తున్నారు. రహదారు లపై ఇనుప వీల్స్ కలిగిన ట్రాక్టర్లు నడిపితే రహదారులు పాడైపోతాయన్న విషయం తెలిసినప్పటికీ, మాకేం పోయిందిలే అన్నట్టు వ్యవహరించడం సరి కాదని వాహనదారులు వాపోతున్నారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ప్రయాణికులు కోరుతున్నారు.

అధ్వానంగా వజ్జాయిగూడ రహదారి



సీతంపేట:

మండలంలోని వజ్జాయిగూడ రహదారి అధ్వానంగా మారింది. రహదారి మొత్తం రాళ్లు తేలిపోవడంతో కొండశివారున ఉన్న గ్రామానికి రాకపోకలు కష్టసాధ్యంగా మారాయి. అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రులకు తరలించాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే అటవీఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాలన్నా ఇక్కట్లు తప్పడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

← రాళ్లు తేలిన వజ్జాయిగూడ రహదారి

● భామినిలో వర్షం



గురండిలో కురుస్తున్న వర్షం

భామిని: మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో శనివారం వర్షం కురిసింది. కొద్ది రోజులుగా వర్షాల్లేక ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు తుఫాన్ నేపథ్యంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సేదదీరారు. అలాగే రైతులకు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బేరాల్లేవు..

● ఆటో డ్రైవర్ల ఆందోళన



ఆవేదన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

వీరఘట్టం: స్త్రీ శక్తి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించడంతో తమ జీవనోపాధికి గండి పడిందని ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 15వ తేదీన ఈ పథకం అమలు కావడంతో ఒక్క రోజులోనే తమపై ప్రభావం పడిందని చెబుతున్నారు. శనివారం స్థానిక ఆటోస్టాండ్ వద్ద కొందరు ఆటోడ్రైవర్లు సాక్షితో మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయం వల్ల వేలాదిమంది ఆటోడ్రైవర్లపై ప్రభావం పడిందని చెప్పారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ నెరవేర్చకుండా ఉచిత బస్సు పథకం అమలు చేయడం సరికాదన్నారు.

వాహన మిత్ర అమలు చేయాలి..



మహిళలకు స్త్రీ శక్తి పథకం అమలు చేయడంతో ఈ ప్రభావం మాపై పడింది. బేరాల్లేక ఆటోలన్నీ స్టాండ్‌లో నిలిచిపోయాయి. ఎన్నికల హామీ మేరకు వాహన మిత్ర పథకం అమలు చేయాలి.

– కరజాడ ఆదినారాయణ, ఆటో డ్రైవర్, కడకెల్ల

రూ.50 కూడా రాలేదు..



ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటకల్లా రూ.500 బేరం అయ్యేది. శనివారం కనీసం రూ.50 కూడా అవ్వలేదు. మహిళలు ఇప్పుడు మా ఆటోలు ఎక్కడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– గురుబిల్లి శివ, ఆటో డ్రైవర్, నడుకూరు

ఆటోలు నడపలేం..

రోజూ నా ఆటో ఎక్కే చాలా మంది మహిళలు ఈ రోజు కళ్ల ముందే బస్సు ఎక్కి వెళ్లిపోయారు. శనివారం ఆటో స్టాండ్‌లో ఆటో ఉంచాను. ఎవ్వరూ ఎక్కలేదు. ఇకపై ఆటోలు నడపలేం.

–లాడి ఈశ్వరరావు, ఆటో డ్రైవర్, కంబర

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : ఎస్పీ

పార్వతీపురం రూరల్: మన పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, ఆ విధంగా ప్రతీ ఒక్కరు బాధ్యత వహిస్తే ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా పలువురికి ఆదర్శం అవుతుందని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న పోలీసుస్టేషన్లలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో, జిల్లాలో వున్న పలు స్టేషన్లలో, సర్కిల్ కార్యాలయా ల్లో, ఎస్‌డీపీఓ కార్యాలయాల్లో పరిసరాలను పోలీ సు అధికారులు, సిబ్బంది శుభ్రం చేశారు. ఈ క్రమంలో ప్రతీ నెలలో కొన్ని రోజులు పర్యావర ణం –పరిశుభ్రతే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ పాటుపడాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

డిగ్రీలో ప్రవేశాలపై ఆలస్యం తగదు

గుమ్మలక్ష్మీపురం: డిగ్రీలో విద్యార్థుల ప్రవేశాలపై ఆలస్యం చేయడం తగదని వైఎస్సార్ సీపీ నాయకుడు, పార్టీ రజక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు ఓ ప్రకటనలో శనివారం అన్నారు. విద్యాసంవత్సరం ఆరంభమై దాదాపు మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ డిగ్రీలో అడ్మిషన్లను ప్రభుత్వం చేపట్టడం లేదు ఎందుకని ప్రశ్నించారు. ఇంటర్మీడియట్ ఫలితాలు వచ్చి నాలుగు నెలలు అవుతున్నా విద్యార్థులు కళాశాలల్లో చేరలేదని, విద్యార్థులకు ఉన్నత విద్యనందించడంలో ప్రభుత్వం విఫలమైందనడానికి ఇదే నిలువెత్తు నిదర్శనమన్నారు. డిగ్రీలో చేరేందుకు వారంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు. ప్రవేశాలు ఆలస్యమైతే విద్యార్థులు చెడు అలవాట్లు బారినపడి చెడిపోయే ప్రమాదం ఉందన్నారు. త్వరితగతిన ప్రవేశాలు చేపట్టాలని కోరారు.

వర్షానికి కూలిన ఇళ్ల పరిశీలన



కూలిన ఇంటి గోడను పరిశీలిస్తున్న తహసీల్దారు శేఖర్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుమ్మంగి, జొల్లగూడ గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దుమ్మంగిలో తోయక శాంతమ్మ ఇల్లు, జొల్లగూడలో నిమ్మల దరుల్లికి చెందిన ఇల్లు పాక్షికంగా కూలిపోయాయి. ఈ మేరకు ఆయా ఇళ్లను తహసీల్దారు ఎన్.శేఖర్ శనివారం పరిశీలించి, జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. బాధితులకు నష్టపరిహారం అందేలా జరిగిన నష్టంపై నివేదిక అందివ్వనున్నట్లు తహసీల్దారు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ బి.శివ తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



గరుగుబిల్లి: రావివలసలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న గ్రామస్తులు

వాడవాడలా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీకృష్ణుడి పుట్టినరోజే ఈ కృష్ణాష్టమి. ఏటా శ్రావణమాసంలోని కృష్ణపక్షంలో వచ్చే అష్టమి తిథి రోహిణి నక్షత్రం రోజున ఈ ఉత్సవాలు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా మహిళలు వేకువజామున పవిత్ర స్నానమాచరించి, శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం యువత వీధుల్లో ఉట్టి కొట్టే ఉత్సవం నిర్వహించి, సందడి చేశారు. కొన్నిచోట్ల చిన్నారుల రాధాకృష్ణుల వేషధారణలు, మరికొన్ని చోట్ల రాధాకృష్ణుల బళ్లవేషాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

–పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



పాలకొండ: రాధాకృష్ణ వేషధారణలో చిన్నారులు



భామిని: సింగిడిలో రాధా వేషధారణలో నృత్యం చేస్తున్న చిన్నారి



పాలకొండ రూరల్: నక్కలపేటలో కొలువైన రాధాకృష్ణ మందిరంలో పూజలు అందుకుంటున్న రాధాకృష్ణులు



కురుపాంలో కృష్ణాష్టమి సందడి

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

గరుగుబిల్లి:

మండల పరిధిలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు శనివారం బారులుతీరారు. భక్తులంతా పుట్టుదేవుడు, శ్రీవారిని దర్శించుకుని, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.



స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో ఉన్న భక్తులు

మూన్నాళ్ల ముచ్చటే...!



పాలకొండ-వీరఘట్టం రహదారిలో కల్యాణ మంటపం వద్ద రహదారిపై ఏర్పడిన గుంత

పాలకొండ రూరల్: పక్క చిత్రంలో కనిపిస్తున్న రహదారి పాలకొండ – వీరఘట్టం వయా పార్వతీపురం మీదుగా ఒడిశా రాష్ట్రం రాయగడ వరకు కొనసాగుతుంది. ఈ రహదారిపై ఏర్పడిన గుంతలపై గతంలో పలుమార్లు సాక్షిలో కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. దీంతో అధికారులు స్పందించి ఇటీవల గుంతలను పూడ్చారు.

అయితే గుంతలు కప్పి నెలన్నర రోజులు కూడా కాకముందే మళ్లీ గోతులేర్పడుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.